క్లుప్తంగా

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



మాక్లూర్: మండల కేంద్రంలోని కేజీబీవీని డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట, స్టోర్‌గదులను పరిశీలించిన అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులతో మాట్లాడి పరీక్షలకు సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎండ తీవ్రత నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థినులకు డీఈవో సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆర్మూర్: వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్ సూచించారు. పట్టణంలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సబ్ యూనిట్ అధికారి సాయిని శుక్రవారం సన్మానించారు. ఇటీవల యాదగిరిగుట్టలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ (ఐఎస్‌టీయూసీ) 55వ మహాసభల్లో సాయి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ స్థాయి మెడికల్ ఆఫీసర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల ప్రతిభను గుర్తించిన కెనరా బ్యాంకు యాజమాన్యం వారికి ఆర్థిక సహాయాన్ని అందజేసింది. స్ఫూర్తి (పదో తరగతి), కీర్తన (తొమ్మిదో తరగతి), శ్రీవిద్య (ఎనిమిదో తరగతి) ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున చెక్కులను బ్యాంకు అధికారులు అందజేసి అభినందించారు. పట్టుదలతో చదువుకుని ఉన్నస్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. డొంకేశ్వర్ కెనరా బ్యాంకు మేనేజర్ మారుతిగౌడ్, హెచ్‌ఎం సురేశ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సుధాకర్



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని శాపూర్ గ్రామానికి చెందిన కొమిరే సుధాకర్ బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆదేశాల మేరకు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. బీఎస్‌పీ నాయకులు సుధాకర్‌ను సన్మానించారు.

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందాలు

ఆర్మూర్: ధరణిలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆర్మూర్ తహసీల్దార్ గజానన్ శుక్రవారం తెలిపారు. తన ఆధ్వర్యంలో అమ్దాపూర్, అంకాపూర్, కోమన్‌పల్లి, మంథని, రాంపూర్, సుర్బిర్యాల్, మగ్గిడి, ఖానాపూర్ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఐదుగురు ఉద్యోగులతో బృందం ఏర్పాటు చేశామన్నారు. అలాగే, పిప్రి, గోవింద్‌పేట్, మామిడిపల్లి, పెర్కిట్, ఇస్సాపల్లి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి నాయబ్ తహసీల్దార్ హరీశ్‌కుమార్ ఆధ్వర్యంలో, ఫత్తేపూర్, చేపూర్, కోటార్మూర్, ఆర్మూర్‌లో సమస్యల పరిష్కారానికి మండల గిర్దావర్ అశోక్‌సింగ్ ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మాక్లూర్: మండలంలోని మాదాపూర్‌లో సీసీ రోడ్డు పనులను ఎంపీడీవో జె క్రాంతి ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.4లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్, బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోనె సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి ఎం రాజేశ్వర్, నరేశ్‌గౌడ్, దేవానందం పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

రుద్రూర్: మండల పరిషత్‌సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేశ్‌బాబు తెలిపారు. ఎంపీపీ సుజాతా నాగేందర్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

పురాతన ఆలయం పునర్నిర్మాణం

- హనుమాన్ ఆలయానికి ఆధ్యాత్మిక వైభవం
- నేడు దేవతామూర్తుల స్థిరప్రతిష్ఠాపన



నూతనంగా నిర్మించిన ఆలయం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

బోధన్‌రూరల్(బోధన్): బోధన్ పట్టణంలోని పురాతన హనుమాన్ ఆలయం పట్టణాభివృద్ధి కమిటీ, దాతలు, పట్టణ ప్రజల సహకారంతో ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది. చావిడి హనుమాన్ ఆలయంగా ప్రసిద్ధి చెందిన అతిపురాతన నడిఊరు హనుమాన్ ఆలయం పునర్నిర్మాణంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పట్టణంలోని చావిడి, దేశాయ్ గడీకి సమీపంలో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరగా, చారిత్రక బోధన్ పట్టణానికి ప్రత్యేక చిహ్నంగా పట్టణాభివృద్ధి కమిటీ సభ్యులు పునర్నిర్మించారు.

కృష్ణ శిలతో విగ్రహాలు

ఆలయ నిర్మాణం కోసం కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి ప్రత్యేకంగా శిలలను తెప్పించారు. ఆలయం లోపల పునః ప్రతిష్ఠకోసం ఆంధ్రప్రదేశ్‌లోని రామడుగు నుంచి తీసుకొచ్చిన కృష్ణ శిలతో హనుమాన్ సమేత శివపంచాయతన విగ్రహాలను తయారు చేయించారు. నిర్మాణ పనులను పూర్తికావడంతో ఫిబ్రవరి 29 నుంచి మూడురోజులపాట ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా శనివారం విగ్రహప్రతిష్ఠాపన, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్యభారతీస్వామి ముఖ్య అతిథిగా హాజరై యంత్రం, మూర్తులు, శిఖర స్థిరప్రతిష్ఠ చేయనున్నట్లు పట్టణాభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు.

అందరి సహకారంతోనే..



పట్టణానికి ప్రత్యేక చిహ్నంగా ఉన్న నడిఊరు హనుమాన్ ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాతలు, పట్టణ పెద్దలు, ప్రజలు, భక్తుల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించాం. విద్యారణ్యభారతీస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– బాగారెడ్డియాదవ్, బోధన్ పట్టణాభివృద్ధి అధ్యక్షుడు

ఉద్యమ అమరులకు నివాళులు



బోధన్ పట్టణంలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



సాలూర మండల కేంద్రంలో..

బోధన్/బోధన్‌టౌన్ : ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమంలో అమరులైన వారికి దళిత నాయకులు శుక్రవారం నివాళులు అర్పించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, గంజ్ ప్రాంతంలో టీఎమ్మార్పీఎస్ (మేడిపాపన్న వర్గం), సాలూరలో టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అమరుల సంస్మరణ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వర్గీకరణతోనే మాదిగ, ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఎస్‌పీ జిల్లా సీనియర్ నాయకుడు డల్లా సురేశ్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మిగారి భూమయ్య, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దప్పు చంద్రయ్య, నాయకులు సాయిలు, అబ్బయ్య, గంగాధర్, గైని రవి, వినోద్, సాయిలు, పోశెట్టి, లింబూరి లక్ష్మణ్,చంటి, లక్ష్మయ్య, సుభాష్, సాయికుమార్, రవి, చందు, రాజు, దిలీప్, టీఎమ్మార్పీఎస్(మేడిపాపన్న వర్గం) రాష్ట్ర నాయకుడు ఎం.విద్యాసాగర్, నియోజకవర్గ ఇన్‌చార్జి వాగ్మారే నాగూరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బెల్లిడిగ సుధాకర్, మహేందర్, నాయకులు ఈరపురం పోశెట్టి, పెద్దింటి సురేశ్, వెంకటరమణ, అద్దంకి రవి, ప్రవీణ్, వాసు, నాగరాజు, రమేశ్, లింగన్న, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి



రుద్రూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేశ్‌బాబు



రెంజల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్

బోధన్‌రూరల్/రుద్రూర్/రెంజల్/ఎడపల్లి(బోధన్): వేసవికాలంలో తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల ఎంపీడీవోలు సూచించారు. బోధన్, రుద్రూర్, రెంజల్ మండల పరిషత్ కార్యాలయాల్లో జీపీ కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేకాధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోలు మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. బోధన్ మండల సమావేశంలో ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, ఏంపీవో మధుకర్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ అనిల్, రుద్రూర్ మండల సమావేశంలో ఎంపీడీవో సురేశ్‌బాబు, ఎంపీవో సాయిలు, రెంజల్ ఎంపీడీవో శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మున్నీనాయక్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీవో గౌస్, ఎడపల్లిలో నిర్వహించిన సమావేశంలో డీఎల్‌పీవో సాయిబాబా, ఎంపీడీవో గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మోర్తాడ్‌లో భూమిపూజ చేస్తున్న అధికారులు



నందిపేట మండలం కుద్వాన్‌పూర్‌లో..

మోర్తాడ్: మండల కేంద్రంలో రూ.35లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ప్రత్యేకాధికారి, ఎంపీడీవో తిరుమల శుక్రవారం భూమిపూజ చేశారు. నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి చొరవతో ఉపాధిహామీ నిధులు మంజూరైనట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల రాములు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ విక్రమ్, నాయకులు పుప్పాల అశోక్, బద్దం మహిపాల్, గోపి, నసీర్, నవీద్, నాగభూషణం, సందీప్, అనిల్, నీరజ్ పాల్గొన్నారు.

కుద్వాన్‌పూర్‌లో..

నందిపేట్: నందిపేట మండలం కుద్వాన్‌పూర్‌లో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో ఎస్సీ కాలనీలో పనులు చేపడుతున్న పంచాయతీ కార్యదర్శి నరేశ్ తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు అన్నాగౌడ్, గోదావరి, ప్రవీణ్‌గౌడ్, నంగి గంగాధర్, తుక్కన్న, సొసైటీ డైరెక్టర్ తోట మహేశ్, జహీరొద్దీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

■ విగ్రహప్రతిష్ఠాపనకు భూమిపూజ



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని లక్కంపల్లిలో హనుమాన్ విగ్రహప్రతిష్ఠాపనకు మాజీ సర్పంచ్ గంగ్ర లతాప్రసాద్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. విగ్రహ ఏర్పాటు కోసం గ్రామస్తులు విరాళాలు సేకరించగా, ప్రసాద్‌రావు తన సొంత స్థలాన్ని అప్పగించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ మోహన్‌రావు, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ భోజన్న, రాజు, కాడెన్న, శ్రీకాంత్, సురేశ్, సాగర్, సుదర్శన్, లక్ష్మణ్, వెంకటేశ్వరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

■ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పెర్కిట్(ఆర్మూర్): మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఉన్న శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద వాల్‌పోస్టర్లను ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవికుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు రిక్కల గంగారెడ్డి, కోశాధికారి డి నాగరాజ్, బద్దం రాజు, సురేశ్ రుక్మాజి, జన్నేపల్లి గంగాధర్, కుస్తాపురం గంగారెడ్డి, దాసరి శ్రీకాంత్, సింధూకర్ చరణ్, లింగాగౌడ్, సారంగి శాంతి, గ్రామ పురోహితుడు కిరీటి కుమార్‌జోషి, పోశెట్టి, మీనుగు రవి శంకర్, కిరణ్, మేడిపల్లి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

■ భక్తులకు అన్నదానం

బాల్కొండ: మండల కేంద్రంలోని నిమషాంబ దేవి ఆలయంలో భక్తులకు శుక్రవారం అన్నదానం చేశారు. నకాశీ సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెలా మొదటి శుక్రవారం అన్నదానం చేస్తున్నారు.

నృత్యనికేతన్ విద్యార్థుల ప్రతిభ



ఆర్మూర్/పెర్కిట్: మాక్లూర్ మండలం గుత్ప అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయ పుష్కర బ్రహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలో నటరాజ నృత్యనికేతన్ విద్యార్థులు ప్రతిభకనబర్చారని నాట్య గురువు బాశెట్టి మృణాళిని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విజయ్ విద్యా సంస్థల అధినేత్రి డాక్టర్ అమృతలత ప్రశంసాపత్రాలతో అభినందించారన్నారు. కార్యక్రమంలో నాట్య గురువు బాశెట్టి మృణాళిని పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



రుద్రూర్: మండలంలోని రాయకూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కోర్బ సాయిలు అలియాస్ శ్యామ్ బీజేపీలో చేరారు. బీఆర్‌ఎస్‌లో కొనసాగిన ఆయన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ విజయ సంకల్పయాత్రలో భాగంగా బాన్సువాడకు ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి రాగా, ఆయన సమక్షంలో గురువారం రాత్రి బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ భూపాల్‌రెడ్డి, ఓబీసీ జిల్లా కార్యదర్శి సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన అనికేశి రమేశ్ గత కొన్ని రోజుల క్రితం ఎస్సారెస్పీలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. బాధిత కుటుంబానికి రమేశ్‌తో కలిసి చదువుకున్న స్నేహితులు రూ.25వేల ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. రమేశ్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవ సంబురాలు

బాల్కొండ: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రయోగాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఎంఈవో రాజేశ్వర్ ప్రయోగాలను పరిశీలించి విద్యార్థులతోపాటు సైన్స్ ఉపాధ్యాయులను అభినందించారు.

చిన్నబోతున్న చేతిపంపు



బాల్కొండ: పల్లె ప్రజల దాహార్తిని తీర్చిన చేతి పంపులు నేడు చిన్నబోతున్నాయి. బోరింగు నీటికోసం ఒకప్పుడు కనిపించిన క్యూలు ఇప్పుడు కనిపించడం లేదు. ఉమ్మడి బాల్కొండ మండలంలో 83 చేతిపంపులు ఉండగా ప్రస్తుతం అవన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. విద్యుత్ సరఫరాతో సంబంధం లేకుండా 24గంటల పాటు నీరు అందుబాటు లో ఉండేది. చేతిపంపులు మూలనపడేందుకు ప్రధాన కారణంగా మరమ్మతులు చేసే మెకానిక్‌లు అందుబాటులో లేకపోవడం అని చెప్పొచ్చు. ఆర్మూర్ డివిజన్ మొత్తానికి చేతిపంపుల మెకానిక్ ఒకరే ఉండేవారు. ప్రస్తుతం ఆ మెకానిక్ కూడా లేకుండాపోయాడు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా నీటిని సరఫరా చేయడం, కాలనీలు, ఇళ్లలో బోరుబావులు తవ్వించడంతో చేతిపంపులతో పని లేకుండాపోయింది. నిరుపయోగంగా ఉన్న చేతిపంపులకు మరమ్మతులు చేయిస్తే విద్యుత్ సరఫరా లేని సమయంలో నీటికి ఇబ్బందులు ఏర్పడవని ప్రజలు పేర్కొంటున్నారు.

హామీల అమలుకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్



వేల్పూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఈరవత్రి అనిల్, నాయకులు



కమ్మర్‌పల్లిలోని మహిళా సమాఖ్య భవనం వద్ద..

వేల్పూర్/కమ్మర్‌పల్లి: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ పథకాల అమలును హర్షిస్తూ కాంగ్రెస్ శ్రేణులు సీఎం కేసీఆర్ చిత్రపటాలకు వేల్పూర్, కమ్మర్‌పల్లి మండల కేంద్రాల్లో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. వేల్పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన 65 రోజుల్లోనే హామీలను అమలు చేయడంతోపాటు 65 వేల ఉద్యోగాల భర్తీ, 11వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు భగవాన్‌దాస్, గౌరాయి నరేందర్, దామోదర్‌గౌడ్, పన్నాల మహేశ్, గంగయ్య, రమణ, చరణ్, బుట్టి మధు, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వరూపఇంద్రాగౌడ్, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు నిమ్మ రాజేంద్రప్రసాద్, బుచ్చి మల్లయ్య, సల్లూరి గణేష్‌గౌడ్, గంగారెడ్డి, శ్రీరాముల మురళి, వెన్నెల దేవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫైళ్లు అందజేత



రుద్రూర్‌లో ఫైళ్లు అందజేస్తున్న లయన్స్ ప్రతినిధులు



నీలాలో పరీక్ష సామగ్రి పంపిణీ..

రుద్రూర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫైళ్లను అందజేశారు. పదోతరగతి ఫలితాల్లో 10జీపీఏ సాధించిన వారికి రూ.5వేల చొప్పున ప్రోత్సాహకం అందజేస్తామని క్లబ్ సభ్యుడు పావులూరి వెంకటేశ్వర రావు ప్రకటించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షుడు ఎం.సాయిబాబాగౌడ్, కార్యదర్శి పళ్లెంపాటి శ్రీధర్, సభ్యుడు అంతయ్య, ఉపాధ్యాయులు శంకర్, రాములు, బి.గంగారాం, టి.రామాగౌడ్, పుల్లారెడ్డి, సోఫియా, అంబర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు పెన్నులు..

రెంజల్(బోధన్): మండలంలోని నీలా హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు ఇతర సామగ్రిని ఉపాధ్యాయురాలు లావణ్య అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్‌తోపాటు పీడీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి



ముల్లంగిలో డీఎంహెచ్‌వోను సన్మానిస్తున్న మాక్లూర్ మండల అధికారులు

మాక్లూర్: క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుదర్శన్ అన్నారు. క్షయ నిర్మూలన గ్రామంగా ఎంపికైన మండలంలోని ముల్లంగి (బి)లో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్షయను వందశాతం నిర్మూలించడానికి స్థానిక వైద్యారోగ్య సిబ్బందితోపాటు పంచాయతీ కార్యదర్శి చేపట్టిన చర్యలు అభినందనీయమని అన్నారు. ముల్లంగి గ్రామస్థాయి అధికారులను ఆదర్శంగా తీసుకొని గ్రామాల్లో క్షయ నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డీపీవో తరుణ్ చ క్రవర్తి, ఎంపీడీవో జె క్రాంతి, ఎంపీవో టి శ్రీనివాస్, పంచాయితీ స్పెషల్ అధికారి ఉమా సహేర్, వైద్యకళాశాల ప్రొఫెసర్ కిశోర్‌కుమార్, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

దేగాంలో..

పెర్కిట్(ఆర్మూర్): టీబీ ముక్త్ గ్రామ పంచాయత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దేగాం గ్రామాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సుదర్శనం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా త్వరలో క్షయరహిత జిల్లాగా మారుతుందన్నారు. డీపీవో చక్రవర్తి తరుణ్, వైద్యులు కిశోర్‌కుమార్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీరాం, హెల్త్ సూపర్ వైజర్ సుధాకర్, నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షాకేంద్రం తనిఖీ

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి రఘురాజ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ఇన్విజిలేటర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి కనీస వసతులు కల్పించాలని సూచించారు.

పిల్లలకు పండ్లు పంపిణీ

సుభాష్‌నగర్: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ జన్మదినం సందర్భంగా నగరశివారులోని డెఫ్ అండ్ డెమ్ స్కూల్‌లో విద్యార్థులకు నాయకులు శుక్రవారం పండ్లు, బిస్కెట్లు, పంపిణీ చేశారు.


అంతకుముందు కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. రవికుమార్, దుబాయ్ శీను, కార్తీక్‌గౌడ్, సతీశ్, నరేశ్ పాల్గొన్నారు.

ఉద్యమాలను ఆపే ప్రయత్నం తగదు



మాక్లూర్: ప్రజల తరుపున శాంతియుత ఉద్యమాలు చేసే కమ్యూనిస్టులను అణగదొక్కే ప్రయత్నం చేయడం ప్రభుత్వాలకు తగదని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి దుడ్డు గంగాధర్ అన్నారు. మండలంలోని మాణిక్‌బండార్ చౌరస్తా వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమస్యలు పరిష్కారం కానప్పుడు కొన్నిసార్లు ఉద్యమాలు తప్పవన్నారు. ప్రజల తరుపున ఉద్యమించే వారిని జైళ్లలో పెట్టి కేసులు పెట్టడం సరికాదని, ఇకనైనా ప్రభుత్వాలు అలాంటి చర్యలకు స్వస్తి పలకాలని కోరారు. ఏజీన్సీ ప్రాంతాల్లో కూంబింగ్ చేస్తూ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో శివరాజ్, వీణచారి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	మా ఊరి రాజారెడ్డి – 10.30 వ్యూహం (తెలుగు) – 1.00 ఊరు పేరు భైరవకోన – 3.45 ముఖ్య గమనిక (తెలుగు) – 7.00 కిక్ (తెలుగు) – 9.45
స్క్రీన్-2 –	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) – 12.15, 3.10, 6.05, 9.00
స్క్రీన్-3 –	ఊరు పేరు భైరవకోన (తెలుగు) – 12.45, 10.00 హనుమాన్ (తెలుగు) – 3.45 ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు)–7.05
స్క్రీన్-4 –	ఇంటి నెంబర్ –13 – 10.45 చారి–111(తెలుగు) – 1.30, 7.20 భూతద్దం భాస్కర్ –4.20, 10.10